క్లుప్తంగా

రేపటి నుంచి వికసిత్ భారత్

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య మంగళవారం తెలిపారు. ప్రతిరోజు రెండు పంచాయతీల చొప్పున ప్రత్యేక వాహనం ద్వారా కేంద్ర పథకాలైన పీఎం కిసాన్, నానో ఎరువులు, భూసార పరీక్షలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, జల్‌జీవన్ మిషన్, బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఇన్సూరెన్స్ నోడల్ అధికారి ద్వారా అవగాహన కల్పిస్తారని తెలిపారు. 7న కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, 8న మల్లాయపాలెం, వేమవరం 9న కె. రాజుపాలెం, కొణిదెన, 10న నక్కబొక్కలపాడు, బల్లికురవ, 11న గుంటుపల్లి పెదఅంబడిపూడి, 12న వల్లాపల్లి కొమ్మినేనివారిపాలెం 13న చెన్నుపల్లి ముక్తేశ్వరం 14న వైదన ఎస్ఎల్ గుడిపాడు, 15న కూకట్లపల్లి, వెలమవారిపాలెం, 16న గొర్రెపాడు, కొత్తూరు, 17 కొప్పెరపాడు గ్రామ పంచాయతీలో జరిగే సంకల్పయాత్రలను విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో అద్దంకి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతేనే తప్ప ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావద్దన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. ఇళ్ల మధ్యలో మురుగు, నీరు నిల్వలు లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని కోరారు. విద్యుత్ స్తంభాలు, తీగల వద్ద ఎవరు ఉండవద్దని కోరారు. పంట నష్టపోయిన రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ సర్వీసులపై మిచాంగ్ తుఫాన్ ప్రభావం

చీరాల అర్బన్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం ఆర్టీసీ సర్వీసులపై పడింది. గత రెండు రోజులుగా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. బాపట్ల వద్ద తుఫాన్ తీరం దాటడంతో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో తుఫాను కారణంగా చీరాల డిపో నుంచి వెళ్లే సర్వీసులు నిలిచాయి. మంగళవారం చీరాల డిపో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే 76 సర్వీసులకుగాను 23 సర్వీసులు మాత్రమే నడిచాయి. పరిసర ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో ఆ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నిలిపివేసినట్లు డిపో మేనేజర్ శ్యామల తెలిపారు.

తుఫాన్ బాధితులకు మందులు పంపిణీ

చీరాల రూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా వివిధ తుఫాన్ షెల్టర్లలో తలదాచుకున్న బాధితులకు వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ విస్తర్ల బాబురావు ఆధ్వర్యంలో మంగళవారం భోజనాలు ఏర్పాటు చేశారు. అలానే వారికి అవసరమైన మందులను అందించారు. తుఫాను కారణంగా జాగ్రత్తగా ఉండాలని సూచించి వారికి ఆరోగ్య పరమైన సలహాలను సూచనలు అందించారు. ఆయన వెంట రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ డీవీ సురేష్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.


మేదరమెట్లలో ఇంటి ముందు విరిగిన చెట్టు

ప్రతాపాన్ని చూపించిన మిచాంగ్

- ప్రభుత్వ ముందస్తు జాగ్రత్తలతో తప్పిన ముప్పు
- బాపట్ల సమీపంలో తీరం దాటిన తుఫాన్
- అప్రమత్తమైన అధికారులు
- రోడ్లపై పారిన వరద
- పునరావాస శిబిరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం


పట్టణంలో పర్యటిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: అందరూ అనుకున్నట్లే మిచాంగ్ తఫాన్ తన తీవ్ర ప్రభావాన్ని చూపించింది. మంగళవారం ఎట్టకేలకు బాపట్ల సమీపంలో తీరం దాటడంతో ఈదుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. తీరం దాటేటప్పుడు సుమారు 90–100 కిలోమీట్లర వేగంతో ఈదురు గాలులు వీచాయి. మిచాంగ్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం రెండు రోజుల ముందే చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఉన్న మత్స్యకార గ్రామాల ప్రజలను తుపాను షెల్టర్లకు తరలించారు. అంతేకాకుండా వారికి వసతి, భోజనం, తాగునీరు, ఇతరత్రా ఏర్పాట్లు చేసి అన్ని విధాల ఆదుకుంది. అందుకు అధికారులు రేయింబవళ్లు పనిచేసి తన బాధ్యతలను నిర్వర్తించారు.

➤ కారంచేడు మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగే ప్రాంతాలను ముందుగానే పరిశీలించి తగు చర్యలు చేపట్టామని మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా సహకారశాఖాధికారి కేవీ రామారావు అన్నారు. ఆయన కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ గ్రామాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షల్లో తహశీల్దార్ ఎస్ వెంకటరత్నం, ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, ఎస్ఐ శ్రీనివాసరావు, ఎంఈఓలు సత్యన్నారాయణ, వెంకటేశ్వర్లు, ఏపీఎం మధుసూదనరావు, ఏపీఎం ప్రదీప్‌కుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదలతో యర్రంవారిపాలెం-ఆదిపూడి మధ్యన ఉన్న వాగు, కొడవలివారిపాలెం-తిమిడెదపాడు గ్రామాల మధ్యన ఉన్న వాగు, దగ్గుపాడు-నాయుడువారిపాలెం గ్రామాల మధ్యన ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

మార్టూరులో వర్ష బీభత్సం..

➤ మార్టూరు నుంచి యద్దనపూడి, గన్నవరం, రాజుగారిపాలెం గ్రామాల మధ్య వాగులు పొంగి పొర్లుతున్నాయి. గుంటూరు-చెన్నై వెళ్లే వాహనాలను స్థానిక రాజుపాలెం జంక్షన్‌లోని రెస్ట్ ఏరియాలో సుమారు 400 వాహనాలు అధికారులు మంగళవారం రాత్రి వరకు నిలిపేశారు.

పునరావాస కేంద్రాల్లో రోటరీ సేవ

చీరాల అర్బన్: తుఫాన్ కారణంగా పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పర్యటించి అధికారులకు సూచనలు అందించారు. శివారు ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులు దండుబాట, వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజి దగ్గర గల యానాదికాలనీ, చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో పునరావాస కేంద్రాల్లో ఉన్న పేదలు 600 మందికి ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, బి.హేమంత్‌కుమార్, డీవీ సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, మువ్వల వెంకటరమణారావు, నీరుకట్టు హరినారాయణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలో పర్యటించిన కృష్ణచైతన్య..

అద్దంకి రూరల్/అద్దంకి: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో అద్దంకి పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏపీ శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణ చైతన్య పర్యటించారు. అద్దంకి నుంచి రేణంగివరం వెళ్లే రోడ్డు నల్లవాగు, అద్దంకి నుంచి మేదరమెట్ల వెళ్లే రోడ్డు నల్లవాగును సందర్శించారు. ప్రవాహం ఎక్కువగా ఉన్నందున రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జిలు, మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కో ఆప్షన్ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు నాయకులు, పాల్గొన్నారు.

జే.పంగులూరు: మండలంలోని బూదవాడ, తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్లపాడు, పంగులూరు, చిన్నమల్లవరం గ్రామాలోన్ని ఎస్సీ కాలనీలో పూర్తి జలయమం అయ్యాయి. కొన్ని ఇళ్లల్లోకి నీరు మోకాల్లోతుకి వెళ్లాయి. మండంలోని అన్ని వాగులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. పంగులూరు సమీపంలో ఇసుకవాగు, చిన్న మల్లవరం సమీపంలో మురుగు వాగు, కోటపాడు గ్రామం సమీపంలో వాగు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. అద్దంకి మండల పేరాయపాలెం వద్ద దోర్నపు వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

చినగంజాం: మిచాంగ్ తుపాను ప్రభావంతో పర్చూరు పరిసర ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వీరన్నపాలెం వద్ద నేలచప్టాపై నీళ్ల ప్రవహిస్తూ ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంకాయలపాడు వద్ద వాగు ఏడు అడుగుల ఎత్తు ప్రవహిస్తుండటంతో పర్చూరు- ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు-మార్టూరు గ్రామాల మధ్య కూడ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పంట పొలాలను పర్చూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మోహన్ రావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పర్చూరు, నాగులపాలెం, చెరుకూరు విద్యుత్ సబ్ స్టేషన్లలో వర్షపు నీరు చేరడంతో మంగళవారం ఉదయం నుంచి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోయింది. చినగంజాం సముద్ర తీరంలో 40 మీటర్లు ముందుకు రావడంతో అలలు ఎగసిపడ్డాయి.

➤ ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన 52 మందికి స్థానిక పాఠశాలలలో, ఇంకొల్లు గ్రామానికి చెందిన 25 మందికి అధికారులు పాఠశాలలో పునరావాసం కల్పించారు. ఇంకొల్లు మండలం స్పెషల్ ఆఫీసర్, తహశీల్దారు, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, వీఆర్వో, పంచాయతీ సెక్రెటరీ బాధిత కుటుంబాల వారిని దగ్గర ఉండి పునరావాస కేంద్రాలకు తరలించారు.


బూదవాడ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు


చినగంజాంలో ముందుకు వచ్చిన సముద్రం


పొంగిపొర్లుతున్న పోలూరు వాగు


ఇంకొల్లు పునరావాస కేంద్రంలో సిద్ధంగా వైద్య సిబ్బంది


చీరాల: శిబిరాల్లో ఆహారం అందిస్తున్న రోటరీ సభ్యులు


పేరాయపాలెం వద్ద పొంగిపొర్లుతున్న దోర్నపు వాగు


అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో విరిగిపడిన చెట్టు


యర్రంవారిపాలెం చర్చి సమీపంలో నీట మునిగిన గృహాలు


బల్లికురవ: కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న తహశీల్దార్


కొడవలివారిపాలెం-తిమిడెదపాడు గ్రామాల మధ్యన రాకపోకలు నిలిపివేసిన అధికారులు


మార్టూరు-రాజుగారిపాలెం రోడ్డులో చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు


స్వర్ణలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆహారం అందిస్తున్న అధికారులు

తుఫాన్ దెబ్బతో రైతన్నకు ఇబ్బందులు


పమిడిపాడులో చెరువును తలపిస్తోన్న శనగ చేను


వల్లాపల్లిలో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న అధికారులు


సంతమాగులూరురోడ్డుపై నేలవాలిన భారీ వృక్షాలు


కుంకుపాడులో నేలకొరిగిన మొక్కజొన్న

అద్దంకి/అద్దంకి రూరల్/జే.పంగులూరు/బల్లికురవ/మేదరమెట్ల: మిచాంగ్ తుఫాన్ రైతన్నలకు నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాలకు అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని మిర్చి, మొక్కజొన్న తదితర పంటల్లో నీరు నిలిచాయి. పలు చోట్ల చెట్లు నేలకొరగడం, విద్యుత్ స్తంభాలు కిందిపడిపోవడం సంభవించడంతో విద్యుత్ సరఫరా నలిచిపోయి గ్రామాలు అంధకారం అయ్యాయి. సంతమాగులూరు మండలంలో భారీ వృక్షాలు నేలకు వరగడంతో పోలీసులు ఆయా చెట్లను కట్ చేయించి తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఇదే విధంగా మరో రెండు రోజులు కొనసాగితే మిర్చి, పొగాకు పంటలు ఊరకేసే ప్రమాదం ఉందని రైతులు, ఉద్యాన,వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు.

అద్దంకి మండలంలో.. మండలంలోని ధర్మవరం, రెడ్డిపాలెం, కలవకూరు గ్రామాల్లో వేసిన వరిపైరు నేలవాలింది. ఇదే గ్రామాలతోపాటు ఇంతర గ్రామాల్లో సాగు చేసిన పప్పు శనగ పంట, మొక్కజొన్న పంట, మిర్చిపంటలో నీరు నిలిచింది. కొరిశపాడు మండలంలో శనగ, కంది పైర్లు పూర్తిగా నీట మునిగాయి.

➤ బల్లికురవ మండలంలో భారీ వర్షపాతం నమోదు అయింది. ఖరీఫ్‌లో బోర్ల కింద వల్లాపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి, వేమవరం గ్రామాల్లో సాగుచేసిన ఆహార ధాన్యమైన వరి కోత దశకు చేరింది. ఈదరుగాలుల ప్రభావానికి నేలవాలింది. మొక్కజొన్న కండెదశలో ఉండగా నేలవాలింది. మిర్చితోటల్లోకి వర్షపు నీరుచేరింది. వల్లాపల్లిలో నేలవాలిన వరిపంటను, నూర్పిడి చేసిన వరి పంటను మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, తహశీల్దార్ కె. రవిబాబు, ఏవో ఎస్ వీపీ కుమారి, ఎంపీడీవో బ్రహ్మయ్య పరిశీలించారు. బల్లికురవ సమీపంలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయాన్ని మండల ప్రత్యేకాధికారి బాల సుబ్రమణ్యం, తహసీల్దార్ కె. రవిబాబు, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఎవో కుమారి, తనిఖీ చేశారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను తెలుసుకుని తనిఖీ చేశారు.

అన్నదాతకు కన్నీటిని మిగిల్చిన మిచాంగ్

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: మిచాంగ్ తుఫాను అన్నదాతలకు కన్నీటిని మిగిల్చింది. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాలైన మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి వచ్చే వరదలతో మెట్ట పైర్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. నీట మునిగిన పంటలను చూసిన అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మండలంలోని 14 గ్రామాల పరిధిలో సుమారు 10 వేల ఎకరాల్లో మిరప, 8 వేల ఎకరాల్లో పొగాకు పంటలున్నాయి. ఇవి కాకుండా వరి పైర్లు సాగులో ఉన్నాయి. తీర ప్రాంతం అయిన చీరాల, బాపట్లకు దగ్గరగా ఉన్న కారంచేడు మండలంలో పంటల నష్టం తీవ్రంగానే ఉండేటట్లు ఉందని అన్నదాతలు వాపోతున్నారు. ఆదిపూడి, తిమిడెదపాడు, కొడవలివారిపాలెం, రంగప్పనాయుడువారిపాలెం, దగ్గుబాడు, పోతినవారిపాలెం ప్రాంతాల్లో ఉన్న మిరప చేలతో పాటు, యర్రంవారిపాలెం, నాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం ప్రాంతాల్లో పొగాకు పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

➤ యద్దనపూడి మండలంలోని పోలూరు, యద్దనపూడి, యనమదల వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. యనమదల, సూరవరపుపల్లి, చింతపల్లిపాడు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి ప్రవేశించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో 16 వేల ఎకరాలు సాగుభూమి ఉండగా మిర్చి 2500 ఎకరాలు, శనగ 2700 ఎకరాలు, పొగాకు 3000 ఎకరాలు, పత్తి 350 ఎకరాలు పూర్తిగా నీటమునిగిపోయాయి.

➤ మార్టూరు మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, హెచ్‌ఓ హనుమంతానాయక్‌లు మార్టూరు, నాగరాజుపల్లి, దర్శి, చిమ్మిరిబండలో పర్యటించి పంట నష్టాలను అంచనా వేశారు. మండలంలో 1100 ఎకరాల్లో మిరప సాగు చేయగా 600 ఎకరాల్లో పంట నీట మునగగా, 70 ఎకరాల మిరప పంట, 2వేల ఎకరాల్లో సాగు చేసిన శనగ పంట చాలా వరకు నీట మునిగింది. వంద ఎకరాల కూరగాయల పంటలు, తుఫానుకు నష్టం వాటిల్లింది.

➤ పర్చూరు మండలంలోని పర్చూరు, బోదవాడ, అడుసుమిల్లి, వీరన్నపాలెం, చేరుకూరు గ్రామాల్లో మిర్చి, పొగాకు, మొక్కజొన్న, శనగ, మినుము పంటలకు నష్టం వాటిల్లినట్లు పర్చూరు ఏడీఏ తెలిపారు.

భారీగా నమోదైన వర్షపాతం..

మిచాంగ్ తుఫాన్ కారణంగా పలు మండలాల్లో భారీగా వర్షపాతం నమోదైంది. సంతమాగులూరు 15 సెంటీ మీటర్లు, బల్లికురవ 13 సెం.మీ, అద్దంకి 16.6 సెం.మీ, కొరిశపాడు 24 సెం.మీ, ఇంకొల్లు 15 సెం.మీ, జే.పంగులూరు 15.2 సెం.మీ, చినగంజాం 10.2 సెం.మీ, చీరాల 29 సెం.మీ, వేటపాలెం 25.4 సెం.మీ, కారంచేడు 15 సెం.మీ, మార్టూరు 14 సెం.మీ, యద్దనపూడి 18 సెం.మీ వర్షపాతం నమోదైంది.


జాగర్లమూడిలో పొగాకు చేలోకి చేరిన నీరు


పూనూరులో చెరువును తలపిస్తున్న మిర్చి పొలం


కారంచేడు-ఆదిపూడి రోడ్డులో నీట మునిగిన మిరప చేలు


కొలలపూడి వద్ద మొక్కజొన్న చేలోకి చేరిన నీరు

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

చీరాల అర్బన్: గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతిచెందిన ఘటన సోమవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకోగా మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పర్చూరుకు చెందిన డి. నల్లయ్య చీరాల డిపోలో రెగ్యులర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంగోలు డ్యూటీకి వెళ్లి తిరిగి చీరాల ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. భోజనం క్యారేజి తీసుకునేందుకు లోపలికి రాగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. అదే సమయంలో డిపో మేనేజర్ జె.శ్యామల స్పందించి అక్కడే ఉన్న డాక్టర్ సహాయంతో ప్రథమ చికిత్స చేయించినా ఫలితం లేకపోకపోయింది. ఆర్టీసీ నుంచి రావాల్సిన తక్షణ సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించినట్లు డిపో మేనేజర్ శ్యామల తెలిపారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన వాహనం

చీరాల అర్బన్: పట్టణంలోని మసీదు సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న కల్వర్టులోకి మంగళవారం అదుపుతప్పి ఒక బొలెరో వాహనం దూసుకెళ్లింది. వర్షం కారణంగా డ్రైవర్‌కు దారి కనిపించకపోవడంతో పక్కన నిర్మాణంలో ఉన్న కల్వర్టులోకి వెళ్లింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు.